# చేతిపంపుల చిలుము వదిలేనా?

- మండలంలో నిరుపయోగంగా 80 చేతి పంపులు
- మరమ్మతుకు నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు
- ప్రజలకు తప్పని నీటి తిప్పలు



చిప్పగిరి గ్రామంలో బురదలో చేతి పంపు..



నగరదోణలో చెట్ల పొదల మధ్య నిరుపయోగంగా చేతి పంపు

**చిప్పగిరి:** మండలంలోని కాజీపురం చెరువులో నీరు అడుగంటడంతో కుళాయిలకు నీరు సక్రమంగా సరఫరా కావడంలేదు. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రత్యామ్నాయంగా చేతిపంపులను ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే ప్రజల నీటి అవసరాలు తీర్చే చేతిపంపులు మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. మరమ్మతులు చేయించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో బోరింగులు చిలింపట్టి శిథిలావస్థకు చేరాయి. దీంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడంలేదు.

**సగానికి పైగా నిరుపయోగం**

మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలోని 16 గ్రామాల్లో మొత్తం 130 చేతి పంపులు ఉండగా వాటిలో 80 చేతి పంపులు మరమ్మతులకు గురయ్యాయి. సంవత్సారాలు గడుస్తున్నా అధికారులెవరూ వాటిని పట్టించుకోక పోవడంతో చేతి పంపులు చిలుము పట్టి శిథిలావస్థలోకి చేరాయి. పల్లెలో చూసినా చెట్ల పొదలలో, ముళ్ల కంపల్లో, చిలుము పట్టి పంపులు వంగి పోయి, హాండిల్ పైకి ఎత్తితే కిందకు, కిందకు దింపితే పైకి ఎత్తలేని స్థితిలో ఉన్నాయి.

**10రోజులకు ఒకసారి నీటి సరఫరా**

మండలానికి ప్రధాన నీటి వనరుగా ఉన్న కాజీపురం జలాశయంలో నీటి నిల్వలు అడుగంటి పోవడంతో మండల ప్రజలకు 10 రోజులకు ఒకసారి మాత్రమే కుళాయిలకు నీరు వస్తుండడంతో మండల ప్రజలు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఇటు చేతి పంపులు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో లేక పోవడంతో నీటి కోసం నానా తిప్పలు పడుతున్నట్లు మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చేతి పంపులు అన్నింటికీ మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.



కుందన గుర్తిలో మరమ్మతుకు గురైన చేతి పంపు

### మరమ్మతులు చేయించాలి



కాజీపురం జలాశయం అడుగంటిన కారణంగా మండలంలో అనేక గ్రామాలకు నీటి ఎద్దడి తలెత్తింది. కనీసం గ్రామాల్లో ఉన్న చేతి పంపులు మరమ్మతు చేయిస్తే సాధారణ అవసరాలకు నీటి సమస్య కొంత మేరకు పరిష్కారం అవుతుంది. సత్వరమే చేతి పంపులు మొత్తం మరమ్మతులు చేయాలి.

– సర్వర్ ఖాన్.. చిప్పగిరి

### మెటీరీయల్ కోసం నివేదిక పంపాం



మండలంలో మరమ్మతుకు గురైన చేతి పంపులకు సంబంధించిన మెటీరీయల్ కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. మెటీరియల్ రాగానే మరమ్మతులు చేపడతాం. మండలంలో ఉన్న ప్రతి చేతి పంపు రిపేరి చేయించి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

- మనోహర్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ

## క్లుప్తంగా

### 14 నుంచి చింతలముని, నల్లారెడ్డి స్వాముల ఉత్సవాలు



తంగరదోణలో నల్లారెడ్డి స్వామి ఆలయ గోపురం

**ఆస్పరి:** మండలంలోని తంగరడోణ గ్రామంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు చింతలముని, నల్లారెడ్డి స్వాముల దశమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పార్వతి ఆదివారం తెలిపారు. ఆలయాలలో 14న గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు, 15న స్వాముల వారి గుర్రం ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 16న ఉత్సవాలు ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. స్వాములను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు.

### నివాళి



హనుమంతరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

**తుగ్గలి :** గుండెపోటుతో మృతి చెందిన మామిల్లకుంట వైఎస్సార్‌సీపీ హనుమంతరెడ్డి భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి నివాళులర్పించారు. ఆదివారం నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్న ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. హనుమంతరెడ్డి పార్టీకి చేసిన సేవలను ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుర్తు చేశారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, ఇన్‌చార్జ్ ఎంపీపీ నాగప్ప, నాయకులు జగన్నాథరెడ్డి, నాగేష్, మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, సుధాకరరెడ్డి, సత్యప్ప తదితరులు ఉన్నారు.

### బాలన్న వర్ధంతి



రాంపల్లిలో స్తూపం ఆవిష్కరిస్తున్న నబీరసూల్

**తుగ్గలి :** సీపీఐ సీనియర్ నాయకులు రాంపల్లి చిన్న బాలన్న ప్రథమ వర్ధంతిని ఆదివారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. గ్రామంలో నిర్మించిన ఆయన స్తూపాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నబీ రసూల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, టీడీపీ, సీపీఐ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు, సుల్తాన్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు కృష్ణయ్య బాలన్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగరాజు, కాశి, లాలన్న, వెంకటరామిరెడ్డి, వీరయ్య, సూరారెడ్డి, ఉమాపతి, పీరా, మద్దిలేటి పాల్గొన్నారు.

### టమాట కొనుగోలును ప్రారంభించిన ఎమ్మెల్యే కేఈ

**తుగ్గలి(పత్తికొండ) :** పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో టమాట కొనుగోలుకు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కొబ్బరికాయ కొట్టి వ్యాపార దుకాణాలను ప్రారంభించారు. మార్కెట్‌లో రైతులు గిట్టుబాటు ధరకు టమాట పంట ఉత్పత్తులు అమ్ము కోవచ్చన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా గిట్టుబాటు ధరలకే పంట ఉత్పత్తులు కొనుగోలు చేయాలని వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు కార్యదర్శి కార్నోలిస్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### వేగంగా సాగుతున్న సేవాలాల్ ఆలయ నిర్మాణం



లక్ష్మీతండాలో నిర్మిస్తున్న సేవాలాల్, మారెమ్మ ఆలయం

**తుగ్గలి :** మండల పరిధిలోని లక్ష్మీతండాలో దాదాపు రూ.40లక్షలతో నిర్మిస్తున్న సేవాలాల్, మారెమ్మ దేవత ఆలయ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. సుగాలీలు తమ ఆరాధ్య దైవమైన సేవాలాల్, మారెమ్మ ఆలయాన్ని చందాలు వేసుకుని నిర్మిస్తున్నారు. పూర్తిగా రాతి కట్టడంతో నిర్మిస్తున్న ఆలయం పనులు తుది దశకు చేరుకున్నట్లు తండా పెద్దలు పేర్కొన్నారు.

### అంబేడ్కర్ విగ్రహంపై దాడి నీచమైన చర్య

**తుగ్గలి :** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ సృష్టికర్త బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై టీడీపీ అల్లరిమూకలు దాడి చేయడం నీచమైన చర్య అని పగిడిరాయి మాజీ సర్పంచ్ జనార్దన్ ఖండించారు. విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి బడుగు వర్గాల ఆత్మగౌరవం కాపాడిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. బరి తెగిస్తున్న కూటమి ప్రభుత్వ కుట్రలను బడుగు, బలహీన వర్గాలు ఐక్యతతో ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.

## శ్రమదానంతో రోడ్డుపై గుంతల పూడ్చివేత



కైరుప్పలలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పడిన గుంతలను పూడ్చుతున్న దృశ్యం

**ఆస్పరి:** మండలంలోని కైరుప్పల గ్రామంలో ఆర్ అండ్‌బీ రోడ్డుపై పడ్డ గుంతలను ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం చేసి పూడ్చి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. ఏఐటీయూసీ మండల సహాయ కార్యదర్శి వీరేష్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కైరుప్పల గ్రామం నుంచి ఎమ్మిగనూరుకు వెళ్లే రోడ్డులో అధ్వానంగా మారిందని, ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో గుంతలో గురుసు వేయడంతో తాత్కాలికంగా వాహనాలు వెళ్లేందుకు వీలుపడిందన్నారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు శ్రీను, రంగన్న, జానకీరాముడు, బద్రి, సురేష్ పాల్గొన్నారు.

### దేవరగట్టులో శ్రావణమాస పూజలు



మాళమల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారులు

**హొళగుంద:** దేవరగట్టులో శ్రావణమాసం మొదటి ఆదివారంలో భాగంగా మాళమల్లేశ్వర స్వామి మూలమూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు ఆలయంలో రుద్రాభిషేకతో పాటు ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాట్‌లకు జలాభిషేకాలు, సుప్రభాత సేవ, రుద్రాభిషేక, భండారార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి గావించి భక్తులకు తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. సింహాసన కట్ట ముందు నెరణికి భక్తులు డోలు వాయిస్తూ తమ భక్తిని చాటుకున్నారు. మాళమల్లేశ్వరుడిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**మద్దికెర :** సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు రాగిణి ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. వైద్యులు సూచనల మేరకు పరిశుభ్రత పాటించి వ్యా ధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారు గ్రామాలలో ఆశా కార్యకర్తల సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

### కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు

**మద్దికెర :** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 357 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందజేసినట్లు ఏఓ రవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రాప్ నమోదుకు కౌలు రైతు కార్డు కలిగి వుండాలన్నారు. దీంతో రైతులకు బీమా, పంటల అమ్మకం, రుణాలు, వివిధ ప్రభుత్వ పథకాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రతికూల వాతావరణం వలన పంటలు నష్టపోయిన సమయంలో కౌలు రైతులకు రుణ అర్హత కార్డుల వలన నష్టపరిహారం అందుతుందన్నారు. సీసీఆర్‌సీ కార్డుల వలన భూ యజమానులకు ఎటువంటి నష్టం ఉండదన్నారు. కౌలు రైతులు వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులను సంప్రదించి సీసీఆర్‌సీ కార్డు పొందాలన్నారు.

### నీటిని సక్రమంగా సరఫరా చేయాలి

**ఆస్పరి:** ఆస్పరి మంచినీటి పథకానికి నాగనాథహళ్లి రిజర్వాయర్ నుంచి నీటిని సక్రమంగా సరఫరా చేయాలని సీపీఐ మండల కార్యదర్శి విరూపాక్షి డిమాండ్‌ చేశారు. ఆదివారం ఆస్పరి సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ సమితి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాగనాథహళ్లి రిజర్వాయర్ నుంచి మంచి నీరు సక్రమంగా రాకపోవడం వల్ల ఆస్పరిలో మంచి నీటి సమస్య నెలకొందన్నారు. స్థానిక బోర్లలో నీటి మట్టం తగ్గిపోవడంతో నాగనాథహళ్లి రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిపైనే ఆస్పరి పట్టణ ప్రజలు ఆధాపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. స్థానిక బస్టాండ్ దగ్గర ఉన్న ఎస్సీ కాంప్లెక్స్ నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, కృష్ణమూర్తి, సంజయ్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నరసింహులు

**ఆలూరు రూరల్:** గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆలూరు ఎస్ఐ నరసింహులు హెచ్చరించారు. ఆదివారం రాత్రి మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో శాంతిభద్రతలపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. అంతకు ముందు స్థానిక పోలీసు స్టేషన్‌లో పరిధిలోని ఏడుగురు రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామస్తులు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా..ఫోన్ 9121101158 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

### ప్రమాదకరంగా కల్వర్టు



చిన్నహ్యాట రోడ్డులో ప్రమాదాలు జరిగే కల్వర్టు

**హొళగుంద:** మండల పరిధిలోని హొళగుంద–ఎల్లార్తి రోడ్డులోని చిన్నహ్యాట గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఎగుడు దిగుడుగా ఉన్న కల్వర్టు వద్ద చాలా ప్రమాదాలు జరిగాయి. కొందరు మృత్యువాత కూడా పడ్డారు. చాలా మంది గాయాలపాలయ్యారు. కల్వర్టు, రోడ్డుకు అర అడుగు ఎత్తు వరకు వ్యత్యాసం ఉండడంతో పాటు గుంతలు పడటంతో వాహనాలు అదుపుకాక అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అయితే అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డు, కల్వర్టు సమానంగా ఉండేలా మరమ్మతు చేయించాలని, అలాగే ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న సీఐ బీవీ విక్రమసింహ, ఎస్‌ఐ తిమ్మయ్య

**నందవరం :** అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ బీవీ విక్రమసింహ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ..నందవరం మండల పరిధిలో ఎస్ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నాగలదిన్నె పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. తెలంగాణ రాష్ట్రం అయిజ మండలం పులికల్లు గ్రామానికి చెందిన తెలుగు సుంకన్న కర్ణాటక మద్యాన్ని బైక్‌పై తలిరలిస్తుడంగా పట్టుకున్నారని చెప్పారు. అలాగే కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా తలమారి గ్రామం నుంచి కర్ణాటక మద్యాన్ని నందవరం మండలంలోని కనకవీడు గ్రామానికి చెందిన బోయ తాయన్నకు తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నారన్నారు. 960 ఒరిజినల్ చాయిస్ విక్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను, బైకును స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

## దళితుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు



ఎమ్మార్పీఎస్‌ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

**కృష్ణగిరి:** దళితుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని ఎమ్మార్పీఎస్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ టీఎం రమేష్ మాదిగ అన్నారు. మండల పరిధిలోని మాదాపురం గ్రామ ఎస్సీ కాలనీలో ఆదివారం ఆయన జిల్లా అధ్యక్షుడు గిడ్డయ్య మాదిగ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన న్యాయమైన హక్కులను అందించాలన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగ, ఆర్థిక, సంక్షేమ, పరిశ్రమ, రాజకీయ రంగంలో సామాజిక న్యాయం చేసి అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాదిగ, కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల అధ్యక్షులు సుంకన్న మాదిగ, మద్దిలేటి మాదిగ, ప్రధాన కార్యదర్శి రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

### మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

**వెల్దుర్తి:** ఎవరికెవరు అన్న ప్రస్తుత సమాజంలో కలిసి చదువుకున్న మిత్రుడు ఆకాల మరణం చెందితే అతని కుటుంబానికి అండగా నిలిచారు స్నేహితులు. ఇటీవల వెల్దుర్తికి చెందిన చల్లా ప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న చిననాటి స్నేహితులు (1994–95వ పదో తరగతి బ్యాచ్) ఆదివారం మిత్రుని ఇంటికి చెరుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. స్నేహితులు తమవంతుగా రూ. 41వేలను చల్లా ప్రసాద్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఏ సమస్య వచ్చిన ఈ మిత్రులు ఉన్నారని మరువద్దమ్మా అంటూ భరోసా ఇచ్చారు. ఆపద సమయంలో ఆదుకున్న ఈ మిత్రబృందాన్ని స్థానికులు అభినందించారు.

### ఈరోజు

**శిక్షణా తరగతులు**

**కృష్ణగిరి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ రామస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ట్రైనర్స్‌లు రిఫ్రెషర్ కోర్సుపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, గ్రేడ్–1, గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణ కార్యక్రమాలకు తప్పక హాజరుకావాలని ఆయన సూచించారు.

**సర్పంచ్‌లకు శిక్షణ**

**చిప్పగిరి:** పారిశుద్ధ్యంపై మండలంలోని సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ బాలన్న ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ తరగతులు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉటుందని తెలిపారు.

**ముగియనున్న గ్రామసభలు**

**కృష్ణగిరి:** ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం చేపట్టిన గ్రామసభలు సోమవారం ముగియనున్నట్లు ఏపీఓ శేషిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఎస్ఆర్‌పీ విజయభాస్కర్‌తో కలిసి మండల పరిధిలోని ఆగవేళి, బోయబొంతిరాళ్ల, చుంచుఎర్రగుడి, లక్కసాగరం గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో పాల్గొన్నారు. తనిఖీ బృందం సభ్యులు క్షేత్రస్థాయి పరిశీలించిన పనుల వివరాల చదివి వినిపించారు. మస్టర్ల నిర్వహణ, రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని వారు సూచించారు. సోమవారం కంబాలపాడు, చిట్యాల, తొగర్చేడు, టి. గోకులపాడులో నిర్వహించే సభలతో గ్రామసభలు ముగుస్తాయన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక**

**ఆలూరు:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్ఐ బసన్నగౌడు ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 12.30 వరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు, తదితరుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది తదితరులు అందుబాటులో ఉండాలని సూచించారు.

## దేవాలయాల ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలి



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ రాష్ట్రాధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి

**ఆదోని అర్బన్:** రాష్ట్రంలోని దేవాలయాలు వాటి ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్రాధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ.. ఆగస్టు 3, 4వ తేదీల్లో తిరుపతి జిల్లాల్లో వరదపయ్యపాలెంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు అంశాలపై తీర్మానం చేశామన్నారు. ధర్మపరిరక్షణకు ఉద్యమాలు చేసిన వివిధ ధార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులపై అక్రమంగా పెట్టిన కేసులను తక్షణమే ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎత్తి వేయాలన్నారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

### ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

**ఆదోని అర్బన్:** శ్రావణమాసం సందర్భంగా పట్టణ శివారులోని రణమండల కొండలో వెలిసిన ఆంజనేయస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకుడు టి.జి.పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి సభ్యులు స్వామివారికి వేకువజామున ఫల పంచామృతాభిషేకం, సిందూరసేవ, తులసీహారం, ఆకుపూజ, బెంగళూరు నుంచి తెచ్చిన వివిధ రకాల పుష్పాలతో అలంకరణ, మహామంగళహారతి గావించారు. ఆదివారం సెలవు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

### ముగిసిన రోప్ స్కిప్పింగ్ పోటీలు

**కర్నూలు (టౌన్):** రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. విజేతగా గుంటూరు, రెండో స్థానంలో నంద్యాల, మూడో స్థానంలో అన్నమయ్య జిల్లా క్రీడాకారులు నిలిచారు. విజేతలకు అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్‌బాషా, నైస్ కంప్యూటర్స్ అధినేత రాయపాటి శ్రీనివాస్ కప్పులు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.

## వృద్ధాశ్రమ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న కేఈ శ్యామ్‌కుమార్

**వెల్దుర్తి:** వెల్దుర్తి మండల పరిధిలోని గుంటుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సీతారామాంజనేయ వృద్ధాశ్రమం నిర్మాణానికి ఆదివారం పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థల, ఆశ్రమ నిర్మాణ దాతలు దమ్మ బాలనాగయ్య, నాగమ్మ, పవన్, వాసంతిని అభినందించారు. పిల్లలున్నా చాలా మంది అనాథలుగా మారుతున్నారని, అలాంటి వారికి ఇలాంటి ఆశ్రమాలు తోడుగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మన శంకర్‌రెడ్డి, ఎల్ఈ జ్ఞానేశ్వర్‌గౌడ్, బలరాం గౌడ్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

### వర్షం కురవాలని కప్పలకు పెళ్లి

**హాలహర్వి:** మండలంలోని విరుపాపురం గ్రామంలో గ్రామపెద్దలు, చిన్నారులు ఆదివారం కప్పలకు పెళ్లి చేసి గ్రామపురవీధులగుండా ఊరేగించారు. వర్షాలు రాకపోవడంతో పంటలు ఎండుతున్నాయని, ఇలాంటి సమయంలో కప్పలకు పెళ్లి చేసి ఊరేగిస్తే వర్షాలు కురుస్తాయని తమ నమ్మకమని గ్రామస్తులు తెలిపారు.



పెనుమాడ సమీపంలో సాగు చేసిన ఉల్లి పంట

## పెరిగిన ఉల్లి సాగు

**కృష్ణగిరి:** ఈయేడాది ఖరీఫ్‌లో బోరు, బావుల కింద ఉల్లి సాగు గణనీయంగా పెరిగింది. ప్రతేడాది నాలుగు వంద ఎకరాల్లో సాగు చేసే రైతులు ఈసారీ దాదాపుగా 750 ఎకరాలకుపైగా సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. దిగుబడుల తోపాటు ధర కూడా ఉంటే ఈయేడాది లాభాలు వస్తాయని ఉల్లి రైతులు ఆశిస్తున్నారు.

## అడుగేస్తే మురుగే

**చిప్పగిరి :** మండలంలోని సంఘాల గ్రామ ప్రధాన రహదారిలో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. గ్రామంలోని 8 వార్డుల్లో మురుగు నీరు రోడ్డుపై పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. నీరు పోవడానికి సౌకర్యం లేక పోవడంతో నిత్యం రోడ్డుపై నిలిచి దుర్వాసన వస్తోంది. దీనికి వర్షపు నీరు కూడా తోడవ్వడంతో రోడ్లు మడుగును తలపిస్తున్నాయి. ఇందులో విషసర్పాలు చేరి ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని చెబుతున్నారు.



ఓ వీధిలో నిలిచిన మురుగు నీరు